# మానవ జీవితానికి ఆధారం - 'ఎడ్యుకేర్'

ప్రేమస్వరూపులారా!

నేనిక్కడికి రావడం కొంచెం ఆలస్యం కావటంచేత అందరికీ కొన్ని అపోహలు బయలుదేరినాయి. ఏ పనీ లేకుండా నేను ఊరికే ఉండను. నాకోసం కాచుకున్న భక్తులకోసం నేను అక్కడే (యజుర్మందిరంలో) ఉండి వారిని సంతృప్తిపరచి బయలుదేరి వచ్చాను. నేను చేసే ప్రతి ఒక్కటీ భక్తులయొక్క పనియే. 'నాది' అనే పని ఒక్కటీ లేదు. నేను తిండి, తీర్థములకోసం రాలేదు. భోజనం చేయటం, నీరు త్రాగటంకూడను నా పని కాదు. కేవలము నాలుక తడుపుకొని మాట్లాడుతుంటాను. ఎంత కొత్త కారైనా పెట్రోలు లేకుండా నడవదు కదా!

ఈనాడు ప్రపంచము పరిపరి విధములుగా ప్రవర్తిస్తున్నది. నైతిక, భౌతిక, ధార్మిక, లౌకిక, ఆధ్యాత్మిక మొదలైన అన్ని రంగములందు మాలిన్యం బయలుదేరింది. చిత్రవిచిత్రముగా మారిపోయిన ఈ జగత్తును చూస్తే చాలా నవ్వు వస్తుంది, బాధకూడా కలుగుతుంది. మానవత్వము చాలా పవిత్రమైనది. మానవత్వముకంటే మించిన శక్తి మరొకటి లేదు. మానవుడు రెండు విధములైన విద్యను అభ్యసించాలి. ఒకటి 'ఎడ్యుకేషన్', రెండవది 'ఎడ్యుకేర్'. 'ఎడ్యుకేర్' అనగా లోపలినుండి వెలికితీసే విద్య; హృదయము నుండి ఆవిర్భవింపజేసుకొనే విద్య. ఎవరో వ్రాసిన పుస్తకాలను చదివి నేర్చుకొనేది 'ఎడ్యుకేషన్'. కాని, ఎడ్యుకేర్ అలాంటిది కాదు. స్వశక్తిచేత సాధన చేసి నీలోనున్నదానిని వెలికితీయాలి. ఏమిటది? నీ లోపల నీవు దాచుకున్న కృత్రిమమైన విషయాలన్నీ బయటకు తీయడం కాదు; సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ, అహింసలనే మానవతా విలువలను వెలికితీయాలి.

మొదటిది సత్యము. సత్యమనేది ఎవరు వ్రాశారు? ఎవరు చెప్పారు? ఇది ఒకరు

sri sathyasai vachanamrutam

## తేదీ 29.9.2006, దసరా ఉత్సవాలు, సాయికుల్వంత్ హాలు

వ్రాసేది కాదు; మన హృదయమునుండి ఆవిర్భవించునటు వంటిదే! “మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనామ్.” మనోవాక్కాయకర్మల ఏకత్వముతో కూడిన మహాత్ములే ఈ సత్యాన్ని బోధిస్తూ వచ్చారు. రెండవది ధర్మము. దీనిని ఎవరు సృష్టించారు? ఇది ఒకరు సృష్టించినది కాదు. “సత్యాన్నాస్తి పరో ధర్మః”. సత్యమునుండియే ధర్మము పుట్టినది. మూడవది శాంతి. ఏ కోటీశ్వరుడినైనా అడగండి, “అయ్యా! మీకన్నీ ఉన్నాయి కదా! మీరు సంతోషంగా ఉన్నారా?” అని. “నాకు అన్నీ ఉన్నాయి కాని, శాంతి లేదు” అని జవాబిస్తాడు. శాంతి అనేది ఒకరిచ్చేది కాదు. హృదయమునుండే రావాలి. ఈనాడు ప్రపంచములో ఎక్కడ చూసినా pieces కనిపిస్తున్నాయికాని, peace కనిపించటం లేదు.

నాల్గవది ప్రేమ. ఈ ప్రేమ ఎక్కడినుంచి వచ్చింది? అమ్మ యిచ్చిందా? అప్ప యిచ్చాడా? ఇంకెవరైనా ఫ్రెండ్స్ గిఫ్ట్ యిచ్చారా? లేదు. ప్రేమ నీనుండియే పుట్టినది. ప్రేమయే నీ ప్రాణం. ప్రేమ లేకుండిన మనకు ప్రపంచమే కనిపించదు. ఐదవది అహింస. “అహింసా ప్రథమో ధర్మః” అని ప్రబోధించాడు, బుద్ధుడు. కాని, ఈనాడు ప్రపంచమందు ఎక్కడ చూసినా హింసయే, హింసయే! అహింస అనేది హృదయమునందే ప్రారంభమౌతుంది. సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలనేవి ఒకదాన్ని ఒకటి అనుసరించి వచ్చేవేగాని ప్రత్యేకమైనవి కాదు. ఈ ఐదు గుణములూ పరమాత్ముని వరప్రసాదములే! వాటిని మనలోనుండి ఆవిర్భవింపజేసుకొని అనుసరించుటకు ప్రయత్నం చేయాలి. అదియే ‘ఎడ్యుకేర్’.

**నాలుకపైన సత్యము నాట్యమాడాలి**

మానవునికి ఉండవలసిన ప్రధానమైన లక్షణము ఏమిటి? సత్యమును పలకాలి. ఇష్టము వచ్చినట్లు అసత్యం పలకటం, నోటికి వచ్చినట్లు మాట్లాడటం మానవత్వం కాదు. నాలుకకు ఎముక లేదు కదా అని ఎట్లా కావాలంటే అట్లా త్రిప్పకూడదు. నాలుకపైన సత్యము నాట్యమాడాలి. ఏదైనా మాట్లాడే ముందు ఇది సత్యమా, కాదా అని విచారణ సల్పాలి. సత్యము ఒక్కటే. Truth is one, not two. రెండుగా ఉన్నది అసత్యమేగాని, సత్యము కానేరదు. హృదయము నుండి ఆవిర్భవించిన సత్యము ఏదైతే ఉన్నదో దానినే మనము

sri sathyasai vachanamrutam

పలకాలి. సత్యమే ప్రపంచముయొక్క స్వరూపం. దీనియందే సర్వమూ సంచరించుచున్నది. ఆకాశంలో సంచరించే మేఘములు అప్పుడప్పుడు సూర్యునికి అడ్డువస్తాయి. వాటిని తోసివేయటానికి వీలుకాదు. వాటితో జగడము వేయడానికి సాధ్యం కాదు. అవి ఏవిధముగా వచ్చినాయో ఆవిధముగానే పోవాలి. ఆ మేఘములు తొలగిపోయిన తక్షణమే సూర్యుడు మనకి గోచరిస్తాడు. అదేవిధముగా, మన హృదయాకాశములో దట్టముగా క్రమ్ముకున్న సంకల్ప వికల్పములనే మేఘములు తొలగిపోయినప్పుడే సత్యము సాక్షాత్కరిస్తుంది.

ఈ ప్రకృతిలో పంచభూతములు సహజముగా పుట్టినవి. అదేవిధంగా, సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలు మానవుని హృదయంలో సహజంగానే ఉన్నాయి. వాటిని ఆవిర్భవింపజేసుకొని మానవుడు సహజమైన జీవితాన్ని గడపాలి. అవి source నుండి రావాలేగాని, force వలన వచ్చేవి కావు. సత్యము, ప్రేమ మొదలైనవి మననుండి సహజంగా ఆవిర్భవించాలి. సత్యము నిర్మలమైనది. ప్రేమ నిస్వార్థమైనది. అందుచే నిస్వార్థముగా మనము జీవించాలి. ప్రేమ దేనినీ ఆశించదు; దేనినీ త్రోసివేయదు. స్వార్థము మనిషిని అనేక విధములుగా కలతపెడుతుంది. ఇది మహా మాయలమారి. దీనిని దగ్గరికి రానివ్వకూడదు. ప్రేమగలవానిని స్వార్థము 'టచ్' చేయలేదు. కాబట్టి, ప్రేమను మీరు అభివృద్ధి పరచుకోండి. అదియే మీకు దైవము. ప్రేమ వచ్చేటప్పటికి అహింస పిలువకనే వచ్చేస్తుంది. ప్రేమ ఉన్నచోట హింసయొక్క నీడకూడా కనిపించదు. ఈవిధంగా, మానవుడు సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలను సాధించినప్పుడే తనకు సరియైన మార్గము తోస్తుంది, సరియైన బుద్ధి కుదురుతుంది.

**కట్టడ యైనయట్టి నిజ కర్మము చుట్టుచు వచ్చి యే గతిం**
**బెట్టునో పెట్టినట్లనుభవింపక తీరదు కాళ్ళు మీదుగా**
**గిట్టక వ్రేలుడంచు దలక్రిందుగ గట్టిరె యెవ్వరైన నా**
**చెట్టున గబ్బిలంబులకు జేరిన కర్మము గాక మానవా!**

గబ్బిలములు తల క్రిందికి, కాళ్లు పైకి పెట్టి చెట్టు కొమ్మలకు వ్రేలాడుతుంటాయి. గబ్బిలములంటే గిట్టక ఎవరైనా వాటిని ఆవిధంగా తలక్రిందులుగా కట్టారా? అది ఒకరు

srisathyasaivacharamrutam

కట్టినది కాదు; భగవంతుని లీలయే! అవి చీకటినే ఆశిస్తాయి. వాటి జీవితమంతా ఆవిధంగానే జరుగుతుంది. అదేరీతిగా, ప్రతి మానవుడు తన కర్మను అనుసరించక తప్పదు. ఆ కర్మ ననుభవించే సమయములోపల కొన్ని మార్పులు కలుగుతాయి. కొన్ని సమయములందు కర్మ చిత్రవిచిత్రంగా కనిపిస్తుంది. కర్మ మానవుణ్ణి అనేకరకములుగా ఆడిస్తున్నది. మరణం సంభవిస్తే దుఃఖిస్తారు; జననము సంభవిస్తే నవ్వుతారు. ఈ నవ్వులు, ఏడ్పులు కర్మ ఫలితములే కదా! భగవంతుడు చేసే చిత్రవిచిత్రములే కదా! ఏది జరిగినా దైవసంకల్పమే అనే విశ్వాసమును మనము అభివృద్ధిపరచుకోవాలి. ప్రపంచంలో జనులు తమకు సుఖము లభిస్తే అది భగవంతునినుండి లభించినదని అనుకుంటారు. తాము అనుభవించే కష్టములకు, నష్టములకు, దుఃఖములకు సాటి వ్యక్తిపైన నింద వేస్తుంటారు. సుఖము, సంతోషము, కష్టము, నష్టము ఇవన్నీ కదిలిపోయే మేఘములే!

**యౌవనంలో మనస్సును అరికట్టుకోవాలి**

విద్యార్థులారా! మొట్టమొదట మీ thoughts ను అరికట్టుకోండి. హృదయాకాశమునందు సంచరించే ఈ thoughts అనే మేఘములు క్రమక్రమేణా మనస్సనే చంద్రుని, బుద్ధి అనే సూర్యుని కప్పివేస్తాయి. చంద్రుడు మనస్సుయొక్క ప్రతిబింబము. బుద్ధి సూర్యుని ప్రతిబింబము. ఈ ఇరువురూ హృదయమనే ఆకాశంలో సంచరిస్తుంటారు. కొన్ని సమయములందు మన భావములు దట్టమైన మేఘాలుగా ఏర్పడతాయి. అందులోను మీకు యౌవనంలో వచ్చే ఆలోచనలు (thoughts) చాలా దట్టమైన మేఘాలవంటివి. అనగా, ఆశలనే నీటితో కూడినవి. అవి అడ్డు వచ్చినప్పుడు ఈ 'సూర్యచంద్రులు' మరుగైపోతారు. యౌవనంలోనే 'ధాట్సు' అధికంగా వస్తాయి; మీకు చెప్పరానటువంటి బాధలంతా కలుగుతుంటాయి. వాటిలో పూర్తిగా మునిగి పోయి మీరు క్రమక్రమేణా మానవత్వాన్నే మర్చిపోతారు. కాబట్టి, మొట్టమొదట ఆ 'మేఘాల'ను మీరు దూరము చేయాలి. 'మేఘాలు' ఎక్కడినుంచి వస్తున్నాయి? అవి సంకల్ప వికల్పముల ప్రభావమే! కాబట్టి, మొట్టమొదట మీరు thoughtsను కంట్రోల్ చేసుకోండి. అప్పుడే మీ మనస్సు, బుద్ధి రెండూ ప్రకాశిస్తూ ఉంటాయి. మనస్సు ఒక bundle of thoughts. సంకల్పాలను అరికట్టుకున్నప్పుడు మనస్సు స్వచ్ఛంగా ఉంటుంది. నరేంద్రుడు

srisathyasaivachanamrutam

(వివేకానంద) మీ వయస్సులోనే ఈ cloudsను, ఈ thoughtsను కంట్రోలు చేసుకోవటానికి ప్రయత్నం చేశాడు. వాటిని దూరం చేసుకున్నప్పుడే అతని హృదయము నిర్మలమైపోయింది. అతను ఏ దేశానికి వెళ్లినా 'నేను పవిత్రమైన భారతదేశంనుండి వచ్చాను', అంటూ భారతదేశ ఔన్నత్యాన్నిగురించి అక్కడివారికి బోధించేవాడు. "నేను భారతీయునిగా పుట్టినందుకు ఎంతో గర్విస్తున్నాను. భారతదేశం ఎంత పవిత్రమైనది! ఎంత నిర్మలమైనది!" అని తనలో తాను తల్చుకునేవాడు. భారతదేశ పవిత్రతనుగురించి తలుచుకున్నా చాలు, ఎంతో గొప్పతనము వస్తుంది. కనుక, మనము మన దేశ ఔన్నత్యాన్నిగురించి తలుచుకుంటూ రావాలి. ఈనాటి పిల్లలు రామకృష్ణ పరమహంస, వివేకానంద ఇలాంటి పెద్దల చరిత్రలను చదవటం లేదు. పిచ్చిపిచ్చి నవలల్ని చదువుతారు. ఈ 'చీప్' పుస్తకాలను మీరు ప్రక్కకు నెట్టాలి.

అందరియందు దైవమున్నాడు. God is everywhere. "ఏకాత్మా సర్వభూతాంతరాత్మా." "అందరి యందున్నది ఒకే ఆత్మ కదా! అటువంటప్పుడు నేను ఫలాని వ్యక్తితో ఎందుకు స్నేహం చేయకూడదు?" అని మీరనవచ్చును. వాని వయస్సు, వాని భావము, వాని ప్రవర్తన, వాని 'థాట్స్' సరియైనరీతిగా లేనప్పుడు నీవు అలాంటివానితో జతకడితే నీవుకూడా అలాంటివాడవే అవుతావు. Tell me your company, I shall tell you what you are. కనుక, మనం మంచివారితో చేరాలి. దీనిని పురస్కరించుకొనియే శంకరులవారు, 'సత్సంగత్వే నిస్సంగత్వం, నిస్సంగత్వే నిర్మోహత్వం, నిర్మోహత్వే నిశ్చలతత్త్వం, నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః' అన్నారు. నీవు మంచివారితో చేరు. మంచి మాటలు మాట్లాడు. మంచి దృష్టిని పెంచుకో. అప్పుడే నీవు మంచివాడవవుతావు. చెడ్డ పుస్తకాలను చదువ కూడదు. చెడ్డ పుస్తకాలను చదవడం ఒకవిధంగా దుస్సంగంలో చేరడం వంటిదే!

**'ఎడ్యుకేర్'కు ప్రధానంగా కావలసింది ఆత్మవిశ్వాసం**

ముఖ్యంగా ఈనాడు మీకు దైవాన్నిగురించి, ఆధ్యాత్మిక విషయాలనుగురించి చెప్పటానికి నేను పూనుకోలేదు. మీరు మీ నిత్యజీవితమును సత్యమైన జీవితముగా గడపటమే నాకు

sri sathyasaivacharamrutam

కావలసింది. సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలనే పంచ ప్రాణములు మీలోపల ఉన్నవి. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములను బయటకునెట్టి లోపలున్న మానవతా విలువలను వెలికి తీయాలి. బావిలో ఉన్న నీరును పైకి తేవాలంటే ఏమి చేయాలి? ఒక పాత్రకు త్రాడు కట్టి, బావిలో వేసి, ఆ త్రాడును పైకి లాగితే పాత్రతోపాటు నీరుకూడా వస్తుంది. అట్లే, మీ హృదయమనే బావిలో మానవతా విలువలనే పవిత్ర జలమున్నది. వాటిని బయటికి తీయాలంటే నమ్మకమనే భద్రమైన త్రాడును సంపాదించాలి. 'నమ్మకమను రెండు నయనంబులే లేని అంధులైరి జనులు అవనియందు'. మనం అంధులం కాకూడదు. నమ్మకాన్ని బలపరచుకున్నప్పుడే మానవత్వం దివ్యత్వముగా మారిపోతుంది. అందరూ ఉపన్యాసాలివ్వగలరు. అయితే, మాటలను విన్నంతమాత్రమున మనకు సంతృప్తి కలుగదు. వింటాము, మరచిపోతాము. అట్లుగాకుండా, విన్నవాటిని ఆచరణలో పెట్టాలి. ముఖ్యముగా మీరు నమ్మకమును భద్రంగా పెట్టుకోవాలి. నమ్మకమనే త్రాడు భద్రముగా ఉండినప్పుడే లోపల విడిచిన 'పాత్ర' సత్య, ధర్మ, శాంతి, ప్రేమలతో నిండి బయటికి రాగలదు. దీన్నే 'ఎడ్యుకేర్' అన్నారు. అంతేగాని, ఎడ్యుకేర్ అనేది ప్రత్యేకంగా బయట లేదు. అది కొంటే లభించేది కాదు; టీచర్సు బోధిస్తే అభివృద్ధి అయ్యేది కాదు. మీకు మీరే దానిని అభివృద్ధిపరచుకోవాలి. అప్పుడే 'సెల్ఫ్ రియలైజేషన్' (ఆత్మసాక్షాత్కారం) కలుగుతుంది. 'సెల్ఫ్ రియలైజేషన్'కు మొట్టమొదట కావలసింది 'సెల్ఫ్ కాన్ఫిడెన్స్' (ఆత్మవిశ్వాసం). 'సెల్ఫ్ కాన్ఫిడెన్స్' రావాలంటే మీ గుణములు పవిత్రంగా ఉండాలి.

ప్రేమస్వరూపులారా! మీరు చదివే చదువులు పొట్టకూటికి తోడ్పడవచ్చు. కాని, మనకు నిజమైన ఆనందాన్నిచ్చేది 'ఎడ్యుకేర్'. అదే మన జీవితానికి ఆధారం. పుస్తక పాండిత్యం ప్రధానం కాదు. ఎమ్మేలు, బియ్యేలు పాసై గొప్ప విద్యావంతులుగా పేరుగాంచిన పెద్దవారలైనను 'ఎడ్యుకేర్'ను ప్రధానంగా తీసుకోవాలి. 'ఎడ్యుకేర్' లేక ఎన్ని చదివినా, ఎన్ని డిగ్రీలు తీసుకున్నా అది విద్యయే కాదు. మీరు చదివే చదువులు దేనికి పనికివస్తాయి? పొట్టకూటికోసం చదివే చదువులివి. గొప్పగొప్ప చదువులు చదివినవారున్నారు లోకంలో. వారందరూ ఏమి చేస్తున్నారు? అహింసనేమైనా అభివృద్ధిపరుస్తున్నారా? ధర్మమునేమైనా



sri sathyasaivachanamrutam

కాపాడుతున్నారా? శాంతినేమైనా పోషిస్తున్నారా? కనీసం తామైనా శాంతిగా ఉన్నారా? లేదు. తమ బిడ్డలనుకూడా తాము ప్రేమించలేక పోతున్నారు. మొట్టమొదట ప్రేమను సాధించండి. మీ ప్రేమను అందరికీ పంచండి. అప్పుడే ప్రేమతత్త్వముయొక్క రుచి మీకు అనుభవంలోకి వస్తుంది. విద్యార్థులయందు అన్ని శక్తులూ ఉన్నవి; పంచభూతములు, పంచకోశములు, పంచేంద్రియములు చాలా భద్రంగా ఉన్నవి. వాటిని సద్వినియోగ పరచుకొనకపోతే మీరు బలహీనులై ఏమీ సాధించలేకపోతారు. ఆధ్యాత్మిక మార్గములో మీకు గట్టి పట్టుదల అవసరం.

**పట్టినదేదియో పట్టనే పట్టితివి**
**పట్టునెగ్గెడుదాక అట్టెయుండు**
**కోరినదేదియో కోరనే కోరితివి**
**కోర్కె చెల్లెడుదాక కొలచియుండు**
**అడిగినదేదియో అడగనే అడిగితివి**
**అడిగినదిడుదాక విడువకుండు**
**తలచినదేదియో తలచనే తలచితివి**
**తలపు తీరెడుదాక తరలకుండు**
**పోరు పడలేక తానైన బ్రోవవలయు**
**ఒడలు తెలియక నీవైన అడుగవలయు**
**అంతియేగాని మధ్యలో ఆపివేసి**
**తిరిగి పోవుట భక్తుని దీక్షకాదు.**

భగవంతుడు పెట్టే పరీక్షలో మంచి మార్కులు రావాలంటే దృఢమైన దీక్ష వహించాలి. చదువులో కూడా దీక్ష వహించాలి. అయితే, మంచి మార్కులు సాధించడంతో తృప్తిపడకూడదు. చెడు రిమార్కులు లేకుండా చూసుకోవాలి. అప్పుడే చదువుకు తగిన విలువ చేకూరుతుంది.

ప్రేమస్వరూపులారా! నిత్యము మీకెన్నో విషయాలు బోధిస్తున్నాను. కాని, మీరు

sri sathyasaivachanamrutam

వాటినిగురించి యోచించటం లేదు. మీరు ఎందుకోసం ఇక్కడకు వచ్చారో మరచిపోతున్నారు. వచ్చినది ఒకదానికోసం, చేసే పని మరొకటి! దీనివల్ల ఏమాత్రం ఫలిత ముండదు. మీరు ఇడ్లీ, సాంబారు కావాలని ఆశిస్తున్నారు. కాని, మిలట్రీ హోటల్‌లోకి పోతున్నారు! మీరు మీ హృదయాన్ని పవిత్రము, పరిపక్వము గావించుకొనేందుకు వచ్చారు. కాని, హృదయాన్ని అపవిత్రము గావించే చర్యలలో ప్రవేశిస్తున్నారు. కారణం? మానసిక కాలుష్యమే! మీ మనస్సును, మీ 'ధాట్సు'ను ఏమాత్రం మాలిన్యపరచుకోకూడదు. మీరు ఆధునిక విద్యతోబాటు ప్రాచీన సాంప్రదాయాన్నికూడా నిల్పుకోవాలి. అప్పుడే మీరు కోరిన ఆనందము మీకు లభ్యమౌతుంది; మీ జీవితము ధన్యమవుతుంది. "ఇహమున సుఖియింప హేమతారక విద్య, పరమున సుఖియింప బ్రహ్మవిద్య". మనము బ్రహ్మవిద్య నేర్చుకోవటానికి వచ్చాం; కేవలం లౌకికమైన విద్యలు నేర్చుకోవటానికి కాదు. లౌకికవిద్యతోబాటు ఆధ్యాత్మిక విద్యకూడా నేర్చుకోవాలి. ఈ రెండింటి యందు మీరు సమానమైన స్థితిలో ప్రయాణము సల్పాలి. అప్పుడే మీరు తగిన సార్థకత పొందుతారు.

**(తేదీ 29.9.2006, దసరా ఉత్సవాలు, సాయికుల్వంత్ హాలు)**

sri sathyasai vahamrutam